# జనగామ నుంచి సమరభేరి



సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కుర్చీలు

- నేడు ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ రాక
- ఆ రోజు నుంచే ఉమ్మడి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం షురూ
- లక్ష మందితో ముఖ్యమంత్రి మీటింగ్
- గులాబీమయమైన జిల్లాకేంద్రం
- 50వేల మంది కూర్చునేలా కుర్చీలు
- అన్ని వైపులా పార్కింగ్ వసతి
- చకచకా పూర్తయిన ఏర్పాట్లు

జనగామ, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ జనగామ ప్రజా ఆశీర్వాద సభకు సర్వం సిద్ధమైంది. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలు, రెండు మున్సిపాలిటీల నుంచి లక్షకు పైగా జనాన్ని తరలించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వేదిక, సభా ప్రాంగణం, కుర్చీలు, లైటింగ్, షామియానాలు వంటి ఏర్పాట్లతో ముస్తాబైంది. సోమవారం కేసీఆర్ రాకను పురస్కరించుకొని జనగామ పట్టణం సర్వాంగ సుందరంగా, గులాబీ రంగు పులుముకుంది. మధ్యాహ్నం 2గంటలకు సిద్దిపేట రోడ్డులోని మెడికల్ కాలేజీ మైదానానికి సీఎం కేసీఆర్ హెలీకాప్టర్‌లో చేరుకొని బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సభను విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ శ్రేణులు ఇప్పటికే సన్నాహక సమావేశాలు నిర్వహించి భారీగా జన సమీకరణ చేయాలని దిశానిర్దేశం చేశాయి. ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసి బీ-ఫారాలు అందజేసిన మరునాడే ఇక్కడ సభ నిర్వహించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకోనున్నది. మరోవైపు ప్రచారంలో బీఆర్ఎస్ జెట్ స్పీడ్‌తో దూసుకుపోతుంటే అంతర్గత కుమ్ములాటలతో ప్రతిపక్ష పార్టీలు ఢీలాపడ్డాయి. గతేడాది ఫిబ్రవరి 11న జిల్లాకు వచ్చిన కేసీఆర్ సమీకృత కలెక్టరేట్, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి యశ్వంతపూర్ వద్ద బహిరంగసభలో మాట్లాడారు. తాజాగా ఈ ఏడాది మరోసారి జిల్లాలో అడుగుపెట్టి ఎన్నికల సమరాంగానికి గులాబీ శ్రేణులను సన్నద్ధం చేయబోతున్నారు.

### లక్ష మందికి సరిపడా మైదానం..

జనగామ చరిత్రలో నిలిచిపోయేలా సభకు ఏర్పాట్లు చేశారు. 50 ఎకరాల సువిశాలమైన స్థలంలో లక్ష మందికి పైగా సామర్థ్యం ఉన్న గ్రౌండ్‌లో 50వేల మంది కూర్చునేందుకు కుర్చీలు, జర్మనీ స్ట్రక్చర్ షామియానాలు వేశారు. అలాగే 2లక్షల మజ్జిగ, మంచినీళ్ల ప్యాకెట్లు, అంబులెన్స్‌లు, వైద్య బృందాలను అందుబాటులో ఉంచారు. సభలో 300 మంది వలంటీర్లు, 200 మంది క్యాటరింగ్ బాయ్స్ సేవలందించనున్నారు. సభా ప్రాంగణానికి ఎదురుగా వికాస్‌నగర్‌లోని సువిశాలమైన ప్రాంతంలో హెలీప్యాడ్ నిర్మించారు. ఇక్కడినుంచి కేసీఆర్ సభాస్థలికి కేవలం 5 నిమిషాల్లో చేరుకునేలా భద్రతాధికారులు ఏర్పాట్లు చేశారు.హెలిప్యాడ్ నుంచి సభాస్థలికి 5 నిమిషాల్లో చేరుకొని తిరిగి భువనగిరి సభకు వెళ్లేలా వికాస్‌నగర్‌లో హెలిప్యాడ్ ఏర్పాటుచేశారు. ఇప్పటికే సభ వేదిక, హెలిప్యాడ్ వంటి అంశాలను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, రాజయ్య, జడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. సభావేదిక, హెలిప్యాడ్, సీఎం రోడ్డు మార్గంలో వచ్చే ప్రాంతాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా, జనగామ డీసీపీ సీతారాం పరిశీలించారు. 600మందితో బందోబస్తు చేపట్టనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు, వీవీఐపీ, వీఐపీల వాహన పార్కింగ్ వంటి అంశాలపై జిల్లా పోలీసు అధికారులతో సమీక్షించారు.

### ఘన స్వాగతానికి జోరుగా ఏర్పాట్లు..

పట్టణంలోని వివిధ వార్డుల నుంచి వచ్చే ప్రజలతో కలిసి మధ్యాహ్నం 12 గంటలకు వివిధ కళారూపాల ప్రదర్శనగా ఒంటిగంట వరకు సీఎం సభాస్థలికి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కేసీఆర్ జనగామ సభ ప్రసంగం ఉంటుందని అంటున్నారు. బతుకమ్మలు, బోనాలు, వివిధ కళారూపాలు, డప్పులు, కోలాట నృత్యాలతో అంబేద్కర్ విగ్రహం నుంచి సభాస్థలానికి అంగరంగ వైభవంగా చేరుకోవాలని అభ్యర్థి పల్లా కోరారు. ఉమ్మడి వరంగల్‌లోనే జనగామ సభ చారిత్రకంగా నిలిచిపోతుందని పల్లా పేర్కొన్నారు. జనగామ జిల్లా ఇచ్చి, మెడికల్ కాలేజీ, అద్భుతమైన కలెక్టరేట్ అందించిన సీఎం కేసీఆర్‌కు ఈ ప్రాంతం అంటే ఎనలేని ప్రేమ ఉందని, ముచ్చటగా మూడోసారి సీఎంగా చేసేందుకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు.

### పార్కింగ్ ప్రాంతాలివే..

బహిరంగ సభకు వచ్చే వాహనాలతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ఆయా ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట, బచ్చన్నపేట నుంచి వచ్చే వారి కోసం బాలాజీ ఫంక్షన్, శామీర్‌పేట గడ్డ గ్రౌండ్‌లో, నర్మెట, జనగామ రూరల్, అర్బన్ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల కోసం సభా వేదిక వేనక వైపు వడ్లకొండ బైపాస్ రోడ్డు వైపు, హన్మకొండ రోడ్డు, హైదరాబాద్ రోడ్డు మార్గం నుంచి వచ్చే వాహనాలకు జిల్లా ఆస్పత్రి ఎదురుగా పార్కింగ్ ఏర్పాట్లు చేశారు.

### ప్రత్యేకంగా 'జర్మన్ స్ట్రక్చర్' వేదిక

సీఎం కేసీఆర్ కూర్చునే సభా వేదికను జర్మన్ స్ట్రక్చర్‌లో భారీ స్థాయిలో నిర్మించారు. ఈ వేదిక లోపల కూర్చున్నవారికి బయట నుంచి ఎండ, ఉక్కపోత లేకుండా చల్లదనంతో ఉంటుంది. ఒకవేళ ఆ సమయంలో వర్షం కురిసినా ఒక్క చినుకు కూడా లోపల పడకపోవడం దీని ప్రత్యేకత. అలాగే సభా వేదికపై వీవీఐపీలతో పాటు వీఐపీలు సుమారు 350మంది వరకు కూర్చునే వెసులుబాటు ఉంటుంది. కానీ నేటి సభకు వేదికపై కేవలం 200మంది ప్రతినిధులకు మాత్రమే అవకాశం కల్పించారు.

# కాంగ్రెస్ జాబితాపై సీనియర్ల నారాజ్

- మొదటి జాబితాలో పేర్లు లేకపోవడంపై అసంతృప్తి
- లిస్టులో ఉమ్మడి జిల్లాలో 4 సెగ్మెంట్లలో అభ్యర్థుల ఖరారు
- మిగిలిన ఆశావహుల ఆగ్రహం
- ములుగుకు సీతక్క... నర్సంపేటకు దొంతి
- ఘన్‌పూర్‌లో ఇందిర... భూపాలపల్లిలో సత్యనారాయణ
- భద్రాచలంలో పొదెం వీరయ్యకు అవకాశం

వరంగల్, అక్టోబరు 15(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీలో అయోమయం, అసంతృప్తులు పెరుగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ దగ్గరపడుతున్నా టికెట్ల విషయం తేల్చకపోవడంపై సీనియర్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థుల ప్రకటన, ప్రచారంలో బీఆర్ఎస్ ముందున్నదని... కాంగ్రెస్ ఇంకా నాన్చివేత ధోరణితో ఉండడం ఏమిటని అంటున్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితాను ఆదివారం ప్రకటించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాల్లో నాలుగు సెగ్మెంట్లు మాత్రమే ఈ జాబితాలో ఉన్నాయి. ములుగు అభ్యర్థిగా ధనసరి అనసూయ(సీతక్క), నర్సంపేట అభ్యర్థిగా దొంతి మాధవరెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ అభ్యర్థిగా సింగారపు ఇందిర, భూపాలపల్లి అభ్యర్థిగా గండ్ర సత్యనారాయణ, భద్రాచలం అభ్యర్థిగా పోదెం వీరయ్య పేర్లను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మిగిలిన ఎనిమిది స్థానాలతో పాటు హుస్నాబాద్, హుజూరాబాద్, ఇల్లందు సెగ్మెంట్లకు అభ్యర్థులను ప్రకటించలేదు. ఈ స్థానాల్లో టికెట్లు ఆశిస్తున్న సీనియర్లు పార్టీ అధిష్టానంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకత్వం తమను అవమానాలకు గురి చేస్తున్నదని వాపోతున్నారు. మహబూబాబాద్ అభ్యర్థిత్వం కోసం ఎదురు చూస్తున్న కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, వరంగల్ తూర్పు టికెట్ ఆశిస్తున్న మాజీ మంత్రి కొండా సురేఖ, జనగామ టికెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, హుస్నాబాద్ టికెట్ రేసులో ఉన్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, వరంగల్ పశ్చిమ టికెట్ ఆశిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి మొదటి జాబితాలో తమ పేరు లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లుగా కష్టపడుతున్న తమను ఎన్నికల సమయంలో అవమానించేలా పార్టీ నాయకత్వ తీరు ఉన్నదని అంటున్నారు. కాంగ్రెస్‌లో టికెట్ అడిగేవారు లేని పరిస్థితి ఉన్నదని, ఇలాంటి తరుణంలో పార్టీలో ఉన్న తమను అవమానించేలా నాయకత్వం వ్యవహరించడం సరికాదని వాపోతున్నారు. కాంగ్రెస్ తరఫున నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒక సారి ఎంపీగా పోటీ చేసిన కొండా సురేఖ పేరు మొదటి జాబితా లేకపోడంపై ఆ పార్టీ నియోజకవర్గ శ్రేణులు పూర్తిగా నైరాశ్యంలో పడిపోయాయి. కొండా సురేఖకు టికెట్ కేటాయింపుపై ఇక్కడి కాంగ్రెస్ శ్రేణులు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ పేరు సైతం మొదటి జాబితాలో లేకపోవడంపై ఇదే చర్చ జరుగుతున్నది. మహబూబాబాద్ సెగ్మెంట్‌లో అంతంత మాత్రంగా ఉన్న కాంగ్రెస్ పరిస్థితి ఇప్పుడు మరింత దిగజారిపోతున్నదని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ప్రతి ఎన్నికల్లో టికెట్ వచ్చినట్లే వచ్చి చేజారుతున్న హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డికి ఈసారి టికెట్‌పై అనుమానాలు పెరుగుతున్నాయి. ప్రస్తుత ఎన్నికల్లోనూ ఆయనకు టికెట్ దక్కుతుందా? లేదా? అని ఆయన సన్నిహితులే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పరిస్థితి ఇలాగే ఉన్నదని హస్తం పార్టీలో చర్చ జరుగుతున్నది.

# హోరాహోరీగా పోటీలు



మహిళల 800 మీటర్ల పరుగుపందెంలో క్రీడాకారులు

- జేఎన్ఎస్‌లో 34వ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ప్రారంభం
- పాల్గొన్న 840 మంది అథ్లెట్లు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 15 : హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్)లో 34వ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం హోరాహోరీగా ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 840 మంది అథ్లెట్లు పాల్గొన్నారు. అండర్-14,16, 18, 20 విభాగాల్లో బాయ్స్ అండ్ గర్ల్స్ వారీగా మొత్తం 140 ఈవెంట్లను నిర్వహించనున్నారు. క్రీడాకారులు బంగారు పతకాలే లక్ష్యంగా సింథటిక్ ట్రాక్‌పై పరుగులు తీశారు. పాత రికార్డులను బ్రేక్ చేస్తూ కొత్త రికార్డులను సృష్టిస్తున్నారు. బాయ్స్ అండర్-16, 800 మీటర్ల పరుగుపందెంలో హైదరాబాద్‌కు చెందిన వినోద్ బంగారు పతకం సాధించాడు. అలాగే నల్గొండకు చెందిన మారెపల్లి ఉమ 300 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్‌మెడల్ సాధించగా, 800 మీటర్ల పరుగుపందెంలో తమిళనాడుకు చెందిన కవల అక్కాచెల్లెల్లు అన్సిలిన్, అక్సిలిన్ గోల్డ్, సిల్వర్ మెడల్స్ పొందారు. అండర్-16 విభాగంలో కర్నాటకకు చెందిన అక్షర 800 మీటర్ల పరుగుపందెంలో బంగారు పతకం సాధించగా, బాయ్స్‌లో హైదరాబాద్‌కు చెందిన వినోద్ బంగారు పతకాన్ని సాధించాడు. మొదటి రోజు జరిగిన పోటీల్లో మొత్తం 9 గోల్డ్‌మెడల్స్, 7 సిల్వర్, బ్రౌంజ్-4 సాధించినట్లు రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, అథ్లెటిక్స్ కోచ్ శ్రీమన్నారాయణ తెలిపారు. సరికొత్త రికార్డులకు హనుమకొండ జేఎన్ఎస్ వేదికగా మారింది. అండర్-16 బాయ్స్ విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో హైదరాబాద్‌కు చెందిన రాథోడ్ రికార్డును తిరగరాశాడు. 156 సెకండ్లలో కొత్త రికార్డును సృష్టించాడు. అలాగే అండర్-18 విభాగంలో 1500 మీటర్ల పరుగుపందెంలో హైదరాబాద్‌కు చెందిన సల్లా మహేష్ 4.01 నిమిషాల్లో పూర్తి చేసి రికార్డు బ్రేక్ చేశాడు. రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, కోచ్ శ్రీమన్నారాయణ, ములుగు సెక్రటరీ పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి విజేతలకు మెడల్స్ అందజేశారు.



షాట్‌పుట్ వేస్తున్న క్రీడాకారిణి



హైజంప్ చేస్తున్న క్రీడాకారిణి



మెన్స్ 800 మీటర్ల పరుగుపందెంలో పాల్గొన్న క్రీడాకారులు

### రికార్డు బ్రేక్ చేస్తాననుకోలేదు..

**రాథోడ్ యుగేంధర్, హైదరాబాద్**



అండర్-16 విభాగంలో 800 మీటర్ల పరుగుపందెంలో బంగారు పతకం సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగాను. రికార్డును బ్రేక్ చేస్తాననుకోలేదు. మాది వరంగల్ అయినా హైదరాబాద్‌లో స్థిరపడి ప్రత్యేకంగా కోచింగ్ తీసుకున్నా. కోచ్ సలహాలు, సూచనలతో ముందుకెళ్తున్నా. అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి పేరు ప్రఖ్యాతలను తీసుకువస్తా.

| టీం | పాయింట్లు | గోల్డ్ | సిల్వర్ | బ్రాంజ్ |
|---|---|---|---|---|
| తమిళనాడు | 233 | 98 | 75 | 60 |
| కర్ణాటక | 138 | 70 | 40 | 28 |
| తెలంగాణ | 81 | 35 | 30 | 16 |
| ఆంధ్రప్రదేశ్ | 54 | 14 | 20 | 20 |
| కేరళ | 26 | 14 | 0 | 12 |
| పుదుచ్చేరి | 12 | 7 | 5 | 0 |